క్లుప్తంగా

పల్లె పండగపై అవగాహన


మాట్లాడుతున్న డ్వామా పీడీ జనార్దన్‌రావు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథక సిబ్బంది పల్లె పండగపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి డ్వామా పీడీ జనార్దన్ రావు హాజరై మాట్లాడారు. మండలంలో సిటిజన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్లానింగ్ ప్రాసెస్, పనులు వేగవంతం చేయాలన్నారు. సీజనల్ , సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్ పంచాయతీల వారీగా తయారు చేయాలని, ఇందులో ప్రజలను భాగస్వామ్యులను చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయరాణి, ఈసీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఏపీఎం రామేశ్వర్

సి.బెళగల్: పొదుపు మహిళ అభివృద్ధికి కృషి వీఓఏలు చేయాలని ఏపీఎం రామేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన వెలుగు సీసీలు, సిబ్బంది, వీఓఏలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పొదుపు గ్రూపు సభ్యులు బ్యాంక్ ద్వారా పొందిన రుణాలతో వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధించేలా వీఓఏలు సూచనలు చేయాలన్నారు. అదేవిధంగా రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలని చెప్పారు. రుణాలను చెల్లించిన పొదుపు గ్రూపు సభ్యులకు వెంటనే రీ షెడ్యూల్ అయ్యేలా సీసీలు చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో సీసీలు రాముడు, గుండమయ్య, ఎంఎస్ అకౌంటెంట్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన బల్కర్ లారీ



గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపాన మలుపు వద్ద బుధవారం సిమెంట్ బల్కర్ అదుపు తప్పింది. జిందాల్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడుతో నంద్యాల వైపు వెళ్తుండగా మలుపు వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవర్ కిందకు దూకేశాడు. ఈ మేరకు స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సస్యరక్షణ పద్ధతులను పాటించాలి


రైతులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: సాగులో సస్యరక్షణ పద్ధతులను పాటించి పంటలను చీడపురుగుల నుంచి రక్షణ కల్పించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి మండలంలోని బ్రాహ్మణదొడ్డి, పోలకల్ – 3 గ్రామ సచివాలయ పరిధిలోని రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ వెంకటేష్, వీఏహెచ్, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : రైతులు ప్రతి ఏడాది ఒకే పంట కాకుండా పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ రవిప్రకాష్ సూచించారు. బుధవారం మండలంలోని పులకుర్తి గ్రామంలో ×పొలం పిలుస్తోంది৷ కార్యక్రమాన్ని ఏఓ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి, కంది, ఆముదం పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ రైతులకు వివరించారు. ఏఓ మాట్లాడుతూ పంటమార్పిడి, అంతర పంటల సాగుతో అధిక లాభాలను పొందవచ్చునన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు, ఎరువులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. సబ్సిడీ శనగ విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొత్త పింఛన్లు లేనట్టేనా..?

- నేటికీ అందుబాటులోకిరాని ప్రభుత్వ వెబ్‌సైట్
- అధికారుల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- టీడీపీ సర్కార్ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న వైనం




వృద్ధురాలికి ఇంటి వద్దనే పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

గడివేముల: టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడంలేదు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా... ఇంత వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణకు నోచుకోలేదు. ఇంతలోనే ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న తీరుపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గడివేముల మండలంలో మొత్తం 5,743 వివిధ రకాల పింఛన్లు ఉన్నాయి. అయితే కొత్తగా అర్హత కలిగిన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో మొత్తం 16 పంచాయతీలు, 14 సచివాలయాలు ఉన్నాయి. ఎస్సీ, బీసీ చెందిన వారు 50 ఏళ్లకే పింఛన్‌ను అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో అర్హులైన పేదలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వస్తున్నారు. అయితే ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులైన వారు నిరాశతో తిరిగి వెళ్లుతున్నారు. అలాగే కొత్తగా వివాహాలైన వారు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయాలకు వెళ్లినా నిరాశ తప్పడం లేదు.

వంద రోజులైనా తెరుచుకోని సైట్...

ఎన్నికల నోటిఫికేషన్ సందర్భంగా నిలిచిపోయిన సైట్, కూటమి ప్రభుత్వం వచ్చి 100 దాటిన ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు సరైన సమాధానం లేకపోవడంతో సచివాలయ సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా వృద్ధులు కార్యాలయం బయట కనిపిస్తే ఏం చెప్పాలబ్బా అనే ఆలోచనలో పడుతున్నారు సచివాలయ ఉద్యోగులు. తప్పని పరిస్థితిలో ఏదో ఒక సమాధానం చెప్పి పంపివేస్తున్నారు. పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో పాటు కొత్తగా వివాహాలు చేసుకున్నవారు కొత్తరేషన్ కార్డుల కోసం ఎప్పుడు సైట్ ప్రారంభిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

గత ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం గ్రామ వలంటీర్లు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసేవారు. దరఖాస్తు చేసుకున్న ఆరు నెలలకు ఒక్కసారి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు అధికారులు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. అయితే నేడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత ప్రభుత్వం సైట్ నిలిపివేసింది. అర్హులైన వారు నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సైతం పింఛన్ మంజూరు చేయించాలంటూ అధికారులకు ఎక్కువ శాతం 50 ఏళ్ల దాటిన పేదలు అర్జీలు సమర్పిస్తున్నారు.

ఉన్న పింఛన్లు తొలగించే కుట్ర!

కొత్త పింఛన్ మాట దేవుడెరుగు... ప్రస్తుతం వస్తున్న పింఛన్లను తొలగించేందుకు కొందరు అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. నియమనిబంధనలు అంటూ ఇప్పటికే కొందరి పింఛన్‌లు రద్దు చేసినట్లు సమాచారం. దీంతో టీడీపీ నాయకుల తీరును పేదలు తప్పుపడుతున్నారు. కొత్త పింఛన్ కోసం ప్రజలు ఎదురు చూస్తుంటే, ఉన్న పింఛన్లను తొలగించడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు



కొత్త పింఛన్ మంజూరుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఆన్‌లైన్ సైట్ ప్రారంభమైతేనే కొత్త దరఖాస్తులు తీసుకునేందుకు అవకాశం. ఈ విషయంపై ఉన్నతాధికారులు త్వరలో ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయిన వెంటనే కొత్త పింఛన్ దరఖాస్తులు స్వీకరిస్తాం.

– వాసుదేవ గుప్త, ఎంపీడీఓ, గడివేముల

మండల అధికారులు... కర్నూలులోనే !


తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సి.బెళగల్: మండల స్థాయి అధికారులు వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రం కర్నూలులోనే ఉండడంతో బుధవారం మండల కార్యాలయాలలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్యసామి కర్నూలు జిల్లా పరిషత్‌లో పంచాయతీ నిర్వహణపై జరుగుతున్న శిక్షణకు వెళ్లారు. అదేవిధంగా తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు భూరికార్డుల రిపోర్టులను అందజేసేందుకు కర్నూలు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. దీంతో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు బోసిపోయాయి. అదేవిధంగా మండల పరిషత్ ఏఓ శ్రీనివాసులు సైతం కాళహస్తీలో శిక్షణకు వెళ్లగా, మరో ఉద్యోగి ఈనెల 14 నుంచి మండలంలో చేపట్టాల్సిన పల్లె పండుగ కార్యక్రమంపై ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి షెడ్యూల్ తెలుసుకునేందుకు వెళ్లినట్లు సమాచారం. కార్యాలయాల్లో అధికారులు లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


సమస్యలపై చర్చిస్తున్న సీపీఎం నాయకులు

సి.బెళగల్: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రం సి.బెళగల్ సీపీఎం నాయకుడు చిన్న అక్బర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సభ్యుల సమావేశానికి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు మోహన్ హాజరయ్యారు. ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మండల సీపీఎం కార్యదర్శిగా ఇబ్రహీంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నారాయణ, మోహన్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మాణం, గ్రామీణ రహదారుల మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో నాయకులు సుందర్‌రాజు, రంగన్న, రాముడు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

వంటనూనెల ధరల కట్టడికి చర్యలు

- రైతు బజార్లలో ఉల్లి కేజీ రూ.36, టమాట కేజీ రూ.42 ప్రకారం లభ్యం

కర్నూలు(సెంట్రల్): వంటనూనెల ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో తక్కువ ధరకే సన్‌ఫ్లవర్, పామాయిల్, ఉల్లి, టమాటాలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు డీఎస్‌ఓ రాజారఘువీర్ బుధవారం తెలిపారు. గురువారం నుంచి నిర్దేశించిన షాపుల్లో వాటిని కొనుగోలు చేయవచ్చన్నారు. జిల్లాలోని అన్ని రైతు బజార్లలో కేజీ టమాట రూ.42, కేజీ ఉల్లి రూ.36కు విక్రయించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సన్‌ఫ్లవర్ ఆయిల్‌కు సంబంధించి సన్‌ప్యూర్, సన్‌జ్యోతి, సన్‌ప్రీతి లీటర్ రూ.126 ప్రకారం అన్ని రైతు బజార్లు, బహిరంగ మార్కెట్లలో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. డీమార్టులో సన్‌ప్యూర్ లీటర్ రూ.125, రిలయన్స్‌మార్టులో గుడ్‌లైఫ్ లీటర్ రూ.119కే అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కర్నూలు చౌక్ బజార్‌లోని రాయల్ కంపెనీలో రాయల్ గోల్డ్ పామాయిల్ లీటర్ రూ.119, జ్యోతిమాల్‌లో ప్రియాగోల్డ్ లీటర్ రూ.121, అంబికా ఆయిల్ మిల్‌లో పామ్‌గోల్డ్ లీటర్ రూ.119 ప్రకారం అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): మానసిక ఒత్తిడి సాకుతో చెడు అలవాట్లకు బానిస కావొద్దని కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల మానసిక వ్యాధుల విభాగంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి మనిషి జీవితంలో ఒత్తిడి ఉంటుందని, దీన్ని సాకుగా చేసుకుని చెడు అలవాట్లకు లోనైతే సమస్యలు ఇంకా అధికం అవుతాయన్నారు. ఇలాంటి సమయంలో మానసిక వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలని చెప్పారు. సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పని ప్రదేశంలో ఒత్తిడికి దూరంగా ఉండాలని సూచించారు. వైద్య, నర్సింగ్ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యాధికారులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మెప్మాలో అంతర్గత బదిలీలు

కర్నూలు (టౌన్): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్లకు పని విభజన, మార్పులు, చేర్పులు చేస్తూ బుధవారం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగ శివలీల ఉత్తర్వులు జారీ చేశారు. జి.అదెమ్మ (1, 3, 25 వార్డులు), ఎస్.ఆర్.వి.సుబ్బారెడ్డి (47, 49, 50 వార్డులు) కె.నాగరాణి (31, 33, 34, 35 వార్డులు), ఎం.సుధాకర్ (18, 31 వార్డులు), ఎ.ఎస్.సబీహా సుల్తానా (17, 19, 21, 42 వార్డులు) బి.అనితమ్మ (6, 7 వార్డులు), ఎల్.పుల్లయ్య (10, 11, 15, 29, 32, 40, 41 వార్డులు), పి.విజయభారతి (28, 29, 30, 40 వార్డులు), జి.సరోజ (23వ వార్డు), కె.విజయభాస్కర్ రెడ్డి (24, 26 వార్డులు), ఏ.వినయ్‌కుమార్ (22, 25, 44, 45, 46, 47 వార్డులు), డి.పుష్పావతి (13, 41, 42, 44 వార్డులు), పి.అరుణమ్మ (4, 5 వార్డులు), అలాగే స్టాంటన్ పురానికి కమ్యూనిటీ ఆర్గనైజర్ కె.నాగరాణి, మామిదాలపాడు బి.అనితమ్మకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

13 నుంచి ఉరుసు

కర్నూలు(అర్బన్): నగర పరిధిలోని జొహరాపురంలో సయ్యద్ అల్లాబకాష్ వలీ ఉరుసు మహోత్సవాలను ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లి (నిర్వాహకులు) సయ్యద్ అల్లాఉద్దీన్ షరీఫ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న గంధం, 14న ఉరుసు (తట్టీలు), 15న కిస్తీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. జొహరాపురంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు కలిసి మూడు రోజుల పాటు సామరస్యంగా ఉరుసు జరుపుకుంటారని వివరించారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు.

ఆందోళనకు మద్దతు

కర్నూలు(సెంట్రల్): తమిళనాడులో జీతాలు పెంచాలని ఆందోళన చేస్తున్న సాంసంగ్ కార్మికులకు మద్దతు తెలుపుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు, నగర ఉపాధ్యక్షుడు కె.సుధాకరప్ప ప్రకటించారు. బుధవారం సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో గాయత్రీ ఎస్టేట్‌లోని ఆ కంపెనీ బ్రాంచ్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీతాలు పెంచమని అడిగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని వేధించడం అన్యాయమన్నారు. పనిగంటలను పెంచడం కార్మిక చట్టాలను వ్యతిరేకమన్నారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ శారద అధ్యక్షతన, ఎంపీడీఓ నాగేశాచల రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు నివేదికలు చదివారు. కె.మార్కాపురం గ్రామంలో రెండు నెలలుగా పశువైద్యశాల వైద్యులు, సిబ్బంది రావడం లేదని సర్పంచ్ గణ మద్దిలేటి సభ దృష్టికి తీసుకువచ్చారు. నాయకల్లు గ్రామంలో వీధిలైట్లు సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేప్పుడు అధికారులు ప్రొటోకాల్ పటించడం లేదని పెద్దటేకూరు ఎంపీటీసీ సభ్యుడు మునిస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. పర్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంపౌండ్ వాల్ నిర్మించాలని ఎంపీటీసీ శేషన్న సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రాధాన్యాతలను సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పొలాల రస్తాలు మొదలగు పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మండల వ్యాప్తంగా రూ.4కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తామన్నారు.


కె.నాగలాపురంలో సరస్వతిదేవి అలంకరణలో శ్రీసుంకుల పరమేశ్వరీ


కోడుమూరు: సరస్వతీదేవిగా అంబా భవానీ


గడివేముల: లలితాదేవిగా వాసవీ అమ్మవారు


సి.బెళగల్‌లో సరస్వతీ దేవిగా పార్వతీదేవి

శ్రీసరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు


కోడుమూరులో శ్రీవల్లెలాంబదేవి పల్లకీ సేవాలో పాల్గొన్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్


సుంకులా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, కుటుంబ సభ్యులు

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీచౌడేశ్వరీ దేవి, శ్రీకాళికామాతా, శ్రీరాములమ్మ, శ్రీతులజా భవాని, శ్రీమాతా అంబా భవాని, శ్రీవల్లెలాంబదేవి ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు అమ్మవారి పల్లకీ సేవాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు చనుగొండ్ల ప్రతాప్‌రెడ్డి, మల్లారెడ్డి, ఫైనాన్స్ వెంకటేశ్వర్లు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో....

దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం గూడూరు మండలంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. గూడూరులోని శ్రీమాతా అంబ భవానీ ఆలయంలో, కె.నాగలాపురంలో వెలసిన శ్రీసుంకులా పరమేశ్వరీ అమ్మవార్లు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీసుంకులా పరమేశ్వరీని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

గడివేముల: మండల కేంద్రం గడివేములలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో బుధవారం అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వసంత లక్ష్మి సత్యనారాయణ శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, గణపతి హోమం, మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన్ గుప్తా, ఉపాధ్యక్షులు సతీష్ కుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఈశ్వరాలయంలో, పాత బస్టాండ్‌లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలోని అమ్మవార్లు బుధవారం సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పాణ్యం: దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బుధవారం సరస్వతి దేవిగా భక్తులకు దర్శమిచ్చారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులను అలరించారు. అలాగే శ్రీవాసవి కాన్యకా పరమేశ్వరి ఆలయంలో, హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కర్నూలు రూరల్ : మండల పరిధిలో వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మ బుధవారం సరస్వతీ దేవి అలంకారణలో భక్తులకు దర్శమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


కోడుమూరు: సరస్వతీదేవి అలంకరణలో వల్లెలాంబదేవి


సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు


శ్రీకాన్యకపరమేశ్వరి ఆలయంలో...


కర్నూలు రూరల్: సరస్వతీదేవిగా వెంకాయపల్లె ఎల్లమ్మ


సి.బెళగల్: ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి

జిల్లా నటీనటులకు అభినందన

కర్నూలు కల్చరల్: యూట్యూబ్ చానెల్ ఆహా ద్వారా విడుదలై ప్రేక్షకులను అలరిస్తున్న తెలుగు చలన చిత్రం బాలుగాని టాకీస్‌లో నటించిన కర్నూలు కళాకారులను పలువురు రంగస్థల కళాకారులు క్రిష్టఫర్, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, మహమ్మద్ మియా అభినందించారు. డోన్ పట్టణానికి చెందిన విశ్వనాథ్ ప్రతాప్ ఈ సినిమాకు దర్శకత్వం వహించడం, కర్నూలుకు చెందిన నటులు ఇనాయతుల్లా, మీనాక్షి రెడ్డి, వేమూరి పరమేశ్వర శర్మ, శంభుప్రసాద్, డోన్ వాస్తవ్యుడు శేఖర్ ఈ చిత్రంలో నటించడం అభినందనీయమన్నారు. ఈ సినిమా పూర్తి కర్నూలు మాండలికంలో సాగుతూ పల్లెటూరు ప్రేక్షకులను ఎంతగానో ప్రభావితం చేయగలదని పేర్కొన్నారు. జిల్లా నుంచి వెలువడిన కథా సంకలనాలలో కర్నూలు మాండలికం బాగా ప్రచారంలోనికి వచ్చిందని, ఈ సినిమా ద్వారా తొలిసారిగా పూర్తి మాండలికం ప్రాచుర్యం పొందిందని కథా రచయిత పౌరోహితం మారుతి అన్నారు. 'ఆహా'లో ప్రసారమవుతున్న ఈ సినిమాను ప్రేక్షకులు వీక్షించవచ్చని నటులు మీనాక్షి రెడ్డి తెలిపారు.

14న పాణ్యం మండల మీట్

పాణ్యం: ఎంపీపీ ఉసేన్‌బీ ఆధ్యక్షతన ఈనెల 14న మండల మీట్ ఉంటుందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో అభివృద్ధి పురోగతి నివేదికలను సేకరించినట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

ఎలుకల నివారణతో పంటలకు మేలు

పాణ్యం: రైతుల తమ పొలలంలో ఎలుకల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటే పంటలను కాపాడుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం పాణ్యంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఎలుకల నివారణకు మందు తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. మందునను తయారు చేయించారు.

చెత్త బుట్టలు మంజూరు

సి.బెళగల్: మండలానికి 10వేల చెత్త బుట్టలు మంజూరు అయినట్లు మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మంజుల తెలిపారు. 18 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొదటి విడతలో బుధవారం 10 వేల బుట్టలు వచ్చాయని, మరో 20 వేలు రావాల్సి ఉందన్నారు.